# మొక్కజొన్న పంటను మద్దతు ధరకు విక్రయించాలి

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- 2025-26 మార్కెటింగ్ సీజన్ లో మొక్క జొన్న కొనుగోలుకు జిల్లాలో 5 కేంద్రాలు ఏర్పాటు



**ఖమ్మం ప్రతినిధి, ప్రజాజ్యోతి :** స్థానిక 2025-26 మార్కెటింగ్ సీజన్ లో మొక్క జొన్న పంటకు ప్రభుత్వం ప్రతి క్వింటాల్ కు 2 వేల 400 రూపాయలు కనీస మద్దతు ధరను ప్రకటించిందని, మద్దతు ధరకు పంట కొనుగోలుకు పక్కా కార్యాచరణ అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలో 1705 ఎకరాల విస్తీర్ణంలో మొత్తం 5456 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న దిగుబడి అంచనాతో,రైతుల నుంచి మొక్క జొన్నను మద్దతు ధరకు కొనుగోలు

మిగతా 2 లో...


జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఖమ్మం
శనివారం | 25 | అక్టోబర్ | 2025 ◆ పేజీలు : 6





# తీగల వంతెన నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

**మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణం సకాలంలో నాణ్యతతో పూర్తి చేయాలి**

- రిటైనింగ్ వాల్ భూ నిర్వాసితులకు అందించే ప్రత్యామ్నాయ భూముల లేఔట్ అభివృద్ధిపై అవగాహన కల్పించాలి
- మున్నేరు కేబుల్ బ్రిడ్జ్, రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను పరిశీలించి, భూ నిర్వాసితులకు కేటాయించే వెంచర్ అభివృద్ధి పనులపై సమీక్షించిన జిల్లా కలెక్టర్

## జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ఖమ్మం ప్రతినిధి, ప్రజాజ్యోతి:** స్థానిక ఖమ్మం మున్నేరు నదిపై చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని,ప్రాజెక్టులకు అవసరమైన భూ సేకరణ పూర్తి చేయడం పట్ల అధికారులు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.శుక్రవారం నగరంలో జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు.మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణం, కాల్వొడ్డు తీగల వంతెన పనులు, మున్నేరు భూనిర్వాసితుల కోసం ఏర్పాటు చేస్తున్న లేఔట్ వెంచర్ పురోగతి పనులను క్షేత్ర స్థాయిలో జిల్లా కలెక్టర్ పరిశీలించారు.అనంతరం రిటైనింగ్ వాల్ భూనిర్వాసితులకు ఇచ్చే ప్రత్యామ్నాయ భూమి లేఔట్ అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ నిపుణుల కమిటీ చేసిన డిజైన్ ల ప్రకారం మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణం పక్కాగా జరగాలని, సకాలంలో పూర్తయ్యేలా చూడాలని అన్నారు.నాగార్జున సాగర్ ప్రాజెక్ట

మిగతా 2 లో...



# నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

## ఎమ్మెల్యే రాగమయి

**ఆదివారం మెగా జాబ్ మేళా సద్వినియోగం చేసుకోండి**

**సత్తుపల్లి, అక్టోబర్ 24 (ప్రజాజ్యోతి ):** సింగరేణి, సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా జాబ్ మేళా విజయవంతం చేసేందుకు అధికారులతో సన్నాహక సమావేశాన్ని శుక్రవారం రాణి సెలబ్రేషన్ లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శాసన సభ్యురాలు మాట్లాడుతూ నిరుద్యోగ సమస్య తీర్చేందుకు 50 కంపెనీలతో సుమారు 3వేల మందికి ఉద్యోగ అవకాశం కల్పించడం జరుగుతుందని, నిరుద్యోగులకు సహాయ సహకారాలు అందించే విధంగా అధికారులు భాగస్వాములు కావాలని అన్నారు. ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగమే కాకుండా,ప్రైవేటు ఉద్యోగాల్లో కూడా మంచి జీతాలు వస్తాయని, జీవితాలను సక్రమంగా దిద్దుకొనుటకు ఉపాధి ఏర్పాటు చేయటం

మిగతా 2 లో...

# కర్నూల్ బస్సు ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మాజీ ఎంపీ నామ



**ఖమ్మం ప్రతినిధి, ప్రజాజ్యోతి:** స్థానిక హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళుతున్న ట్రావెల్స్ బస్సుకు కర్నూలు జిల్లాలో చోటుచేసుకున్న ఘోర బస్సు ప్రమాదం పట్ల బిఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్షనేత,ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రాణాలు కోల్పోయిన ప్రయాణికుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ దుర్ఘటనలో గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరటం తో పాటు,త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రమాద ఘటనలోని బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని నామ కోరారు.

# ఖమ్మం నగరానికి కొత్త రూపు...

- ఆర్ ఆర్ ఆర్ మార్గం రూపుదిద్దుకుంటుంది
- కేవలం రహదారి కాదు — ఖమ్మం నగర అభివృద్ధి దిశగా కొత్త పథం.
- నగర పరిసర ప్రాంతాల అభివృద్ధికి దారితీసే మరో ముందడుగు
- భట్టి విక్రమార్క కృషితో సాధ్యం.

**ముదిగొండ అక్టోబర్ 24(ప్రజాజ్యోతి):** ముదిగొండ రఘునాథపాలెం మార్గంలో వయ లక్ష్మీపురం, ఖానాపురం, పండ్రేగపల్లి, రామకృష్ణాపురం, అల్లిపురం, పుట్టకోట, ఎస్.ఆర్. గార్డెన్, ఖానాపురం హవేలీ వరకు సాగుతున్న రీజనల్ రింగ్ రోడ్ (ఆర్ ఆర్ ఆర్) రూపకల్పనతో ఖమ్మం చుట్టూ ఆధునిక రహదారి వలయం పూర్తవుతోంది. ఈ మార్గంలో పండ్రేగపల్లి – రామకృష్ణాపురం మధ్య మున్నేటి వాగుపై 30 కోట్లతో హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం ప్రతిపాదించబడింది.అదే విధంగా రామకృష్ణాపురం నుండి అల్లిపురం వరకు మిగిలి ఉన్న సుమారు రెండు కిలోమీటర్ల బీటీ రోడ్ పనులు కూడా ప్రతిపాదనలో ఉన్నాయి.
ఈ రెండు ప్రధాన పనులు మంజూరు అయితే, ముదిగొండ నుండి రఘునాథపాలెం వరకు సాగే రీజనల్ రింగ్ రోడ్ సుమారు 70% పూర్తయినట్టే. పట్టణ ట్రాఫిక్ తగ్గడం, గ్రామీణ ప్రాంతాల అనుసంధానం, పరిశ్రమలు మరియు వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు సులభ మార్గం వంటి అనేక ప్రయోజనాలు కలిగించే ఈ ప్రాజెక్టు, ఖమ్మం నగరానికి భవిష్యత్ వృద్ధి శక్తిగా నిలుస్తుంది.ఈ అభివృద్ధి వెనుక ఉన్న దూరదృష్టి తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు ముందుచూపు,ఆలోచన,పట్టుదల ఖమ్మం జిల్లా ప్రజలకు ఆర్థిక, వాణిజ్య, రవాణా రంగాలలో కొత్త అవకాశాలు సృష్టించే ఈ ప్రాజెక్టు, "ఒక నగరానికి అభివృద్ధి అంటే రహదారులు – ఆ రహదారుల వెనుక ఉన్న ఆలోచన భట్టి విక్రమార్క" అనే నిజాన్ని మరోసారి నిరూపిస్తోంది.



## నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే లక్ష్యం ఎమ్మెల్యే రాగమయి



(మొదటి పేజీ తరువాయి...)

మా లక్ష్యం అని తెలియజేశారు. ఈ జాబ్ మేళా ఉదయం 9 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, పది పాస్ అయిన వారి దగ్గర నుండి అందరూ పాల్గొని ఉద్యోగాలు పొందాలని నిరుద్యోగ సమస్యను తగ్గించేందుకు ఈ ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. ఏదో ఒక ఉద్యోగం కచ్చితంగా జాయిన్ అయి మన నిజాయితీ నిరూపించుకుంటే మన భవిష్యత్తుకు అదే దారి చూపిస్తుందని తెలియజేశారు. నియోజకవర్గం లోని విద్యార్థులు ఇంటర్వ్యూలో సక్సెస్ కావాలనే ఉద్దేశంతో గత రెండు రోజుల నుండి కెరియర్ పై,ఇంటర్వ్యూలు తట్టుకునే విధంగా కెరియర్ డెవలప్మెంట్ సెమినార్ విద్యార్థులకు ఇప్పిస్తున్నామని, మోటివేషన్ కార్యక్రమాలు సైతం విద్యార్థులకు అందిస్తున్నామని ఆనందం వ్యక్తం చేశారు.నిరుద్యోగులు ఈ సదవకాశాన్ని వినియోగించుకొని ఉద్యోగ సంపాదించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దోమా ఆనంద్ బాబు, గాదె చెన్నారావు, కమల్ పాషా, నిరుద్యోగులు ఉన్నారు.

## తీగల వంతెన నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

క్రింద సేకరించిన భూములను అభివృద్ధి చేసి మున్నేరు నది రిటైనింగ్ వాల్ భూ నిర్వాసితులకు అందించేలా రైతులతో చర్చలు జరపాలని తెలిపారు. రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తి స్థాయిలో నిర్మించాలని,రెండు వైపుల నుంచి ప్రణాళికాబద్ధంగా పని జరగాలని అన్నారు.రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ ప్రాధాన్యతతో పూర్తి చేయాలని,ఏజెన్సీ అదనపు బృందాలు ఏర్పాటు చేసి పనులు చేయాలని అన్నారు. మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ నిమిత్తం రైతులకు,నిర్వాసితులకు అందించే 125 ఎకరాల ప్రత్యామ్నాయ భూముల లేఔట్ వెంచర్ అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, వెంచర్ కు 100 మీటర్ల ప్రధాన రహదారి, 40 మీటర్ల చొప్పున అంతర్గత రహదారి, నగరంకు సులుభతరం చేసే విధంగా అదనంగా ఓవర్ బ్రిడ్జి నిర్మాణం,ప్రత్యేకంగా కల్పించే వసతులతో ఒక ప్రత్యేక వెంచర్ తో భూమి విలువ పెరిగి చుట్టు ప్రక్కల విస్తృతంగా అభివృద్ధి జరుగుతుందని తెలిపారు.ప్రజలకు అందించే భూములలో లేఔట్ అభివృద్ధి అంతర్గత రోడ్లు,కనెక్టివిటీ అంశాలు ప్రజలకు పూర్తి స్థాయిలో వివరించాలని అన్నారు.ఖమ్మం నగరంలో మున్నేరుపై నిర్మించే కేబుల్ బ్రిడ్జి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని,నిర్ణీత గడుపు లోపు ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వచ్చే విధంగా నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలని అన్నారు. తీగల వంతెన నిర్మాణం వల్ల ఎవరు కూడా నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ఆర్&బీ ఎస్ఇ యాకుబ్, ఇఇ పవార్, ఆర్డీఓ నరసింహారావు,ఇరిగేషన్ డిఇ రమేష్ రెడ్డి, ఖమ్మం అర్బన్, రూరల్ మండల తహసీల్దార్లు సైదులు,రాంప్రసాద్,అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న పంటను మద్దతు ధరకు విక్రయించాలి

(మొదటి పేజీ తరువాయి...)

చేయుటకు జిల్లా వ్యాప్తంగా 5 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా, రైతులు తమ పంటను తడి శాతం 14 శాతం లోపు ఉండేలా చూసి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు.మధిర, ఎర్రుపాలెం వ్యవసాయ మార్కెట్ యార్డ్ లలో, ఖమ్మం రూరల్ మండలం గుదిమళ్ళ మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో, సింగరేణి మండలం మాదారంలో కారేపల్లి సహకార సొసైటీ లో, ముదిగొండలలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.రైతులందరూ తేమ శాతం 14 శాతం లోపు ఉన్న పంటలను మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# గృహప్రవేశ వేడుక లో పాల్గొన్న ఎమ్మెల్యే మట్టా





**పెనుబల్లి అక్టోబర్ 24 ప్రజాజ్యోతి :** పెనుబల్లి మండలం లంకసాగర్ గ్రామం లో రాచబంటి లక్ష్మి, కృష్ణ ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుల గృహప్రవేశం సందర్భంగా లబ్ధిదారుల దంపతులకు శుభాకాంక్షలు తెలిపి, పూజా కార్యక్రమం లో పాల్గొన్న సత్తుపల్లి నియోజకవర్గం శాసనసభ్యులు శ్రీమతి డాక్టర్ మట్టా రాగమయి దయానంద్. ఎమ్మెల్యే రాగమయి దయానంద్ ని వారి ఇంటి ఆడపడుచుగా పసుపు, కుంకుమ తో స్వాగతం పలికన దంపతులు తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్య మంత్రి బట్టి , రాష్ట్ర మంత్రివర్యులు పొంగులేటి , తుమ్మలకు ధన్యవాదములు తెలిపిన ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, కల్లూరు చైర్మన్ నీరజ ప్రభాకర్ చౌదరి, వైస్ చైర్మన్ కోటేశ్వరరావు, లంకసాగర్ ఇందిరమ్మ కమిటీ మరియు ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు, పెనుబల్లి మండలం, లంకసాగర్ కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు.

## కలుపు మందు తాగి మహిళా ఆత్మహత్యా యత్నం

- పరిస్థితి విషమయం ఖమ్మం ఆసుపత్రికి తరలింపు



**సత్తుపల్లి అక్టోబర్24(ప్రజా జ్యోతి ):** కలుపు మందు ను ఓ మహిళ కూల్ డ్రింక్ లో కలిపి తాను తాగి తమ పిల్లలకు తాగించిన, సంఘటన సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం. సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ద్వారకాపురి కాలనీకి చెందిన పటాన్ సల్మా (28) ప్రైవేట్ కంపెనీలో పని చేస్తుంది. భర్త సలీం బజాజ్ షోరూం లో మెకానిక్ గా పనిచేస్తూ జీవనం సాగిస్తుండగా పటాన్ సల్మా, సలీం దంపతులకు పటాన్ నస్మిన్,( 9) సయాన్ (6) కుమారులతో కలిసి జీవిస్తుండగా తల్లి సల్మా శుక్రవారం కలుపు మందు ను కూల్ డ్రింక్ లో కలిపి పిల్లలకి ఇవ్వగా నస్మిన్, పెద్ద కుమారుడు తాగేందుకు నిరాకరించి బయట పారబోయగా, చిన్న కుమారుడు సయాన్ కలుపు మందు కలిపి కూల్ డ్రింక్ ను తల్లితో పాటు తాగాడు. చుట్టుపక్కల వారు గమనించి స్థానిక సత్తుపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రధమ చికిత్స అందించి తల్లి సల్మా, చిన్న కుమారుడు సయాన్, పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్య సేవలు నిమి త్తం ఖమ్మం ఆస్పత్రికి తరలించారు, ఆత్మహత్యాయత్నానికి సంబంధించిన కారణాలు తెలియాల్సి ఉంది.

## చట్టాలు హక్కులపై బాలికలు విద్యార్థి దశలోనే అవగాహన పెంచాలి



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** స్థానిక చట్టాలు, హక్కుల 'పై బాలికలు విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకునేలా అవగాహన కల్పించాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలీస్ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వైరా ఎస్సై రామారావు వైరా మండలం ముసలిమడుగులోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులకు, మధిర ఇన్స్పెక్టర్ రమేష్ మధిర లోని బిసి బాలికల హాస్టల్లో విద్యార్థులకు కారేపల్లి ఎస్సై గోపి కారేపల్లిలోని టిఎస్ మోడల్ స్కూల్ విద్యార్థులకు,రూరల్ పోలీసులు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కెజిబివి పాఠశాల విద్యార్థులకు,చింతకాని మండలం లచ్చగూడెం గ్రామంలోని రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులకు బాల్యవివాహాల నిర్మూలన చట్టం,పోక్సో చట్టాల గురించి వైరా పోలీసులు అవగాహన కల్పించారు. బాలికలు చైతన్యవంతులైతేనే వారిపై జరుగుతున్న లైంగికవేధింపుల నుంచి రక్షణ పొందగలరని సూచించారు.అదేవిదంగా విద్యార్థినులపై వేధింపులను అడ్డుకోవడం, అసభ్యకరమైన ప్రవర్తనలను అరెస్ట్ చేసి చట్ట ప్రకారం శిక్షించడం.సోషల్ మీడియా,సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

## అయ్యప్ప మండల దీక్షలు ప్రారంభం

- అయ్యప్ప మాలలు ధరించిన కోయచలక భక్తులు



**రఘునాధపాలెం, ప్రజాజ్యోతి:** ఖమ్మం జిల్లా రఘునాధపాలెం మండలం కోయిచలక గ్రామంలో శుక్రవారం పలువురు భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మాలలు ధరించారు. గ్రామంలోని స్థానిక దేవాలయంలో అయ్యప్ప దీక్షదారుల పీఠం ఏర్పాటు చేసి మండల దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా అయ్యప్ప మాలలు ధరించిన భక్తులు భక్తి శ్రద్ధలతో స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. మేళ్లచెరువు రాంప్రసాద్ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి దేవాలయంలో 45మంది అయ్యప్ప మాలధారణ కార్యక్రమాన్ని చేపట్టారని గురుస్వామి రాంప్రసాద్ తెలిపారు.ఈ సందర్భంగా అయ్యప్ప మండల దీక్షలు కార్తీక మాసంతో ప్రారంభమవుతాయి, ఈ దీక్ష 41 రోజుల పాటు కొనసాగుతుంది. మాలధరించిన అయ్యప్ప స్వాములు, భక్తి శ్రద్ధలతో అయ్యప్పస్వామి నియమాలు పాటించాలని అన్నారు.

## తల సేమియా బాధితులు కోసం రక్తదాన శిబిరం

- రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి



**రఘునాధపాలెం ప్రజా జ్యోతి:** రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని అడిషనల్ డీసీపీలా &అర్డర్ ప్రసాద్ రావు అన్నారు.పోలీస్ అమరవీరుల వారోత్సవాల (ఫ్లాగ్ డే) పురస్కరించుకొని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు సీటి ఆర్మడ్ పోలీస్ హెడ్ క్వార్టర్స్ లోని రక్తదాన శిభిరాన్ని నిర్వహించారు. అడిషనల్ డీసీపీ లా &అర్డర్ ప్రసాద్ రావు అడిషనల్ డీసీపీ అడ్మిన్ రామానుజం, అడిషనల్ డీసీపీ (ఏఆర్) కుమారస్వామి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏసీబీ రమణమూర్తి, రఘునాథపాలెం మండలం పోలీస్ స్టేషన్ సిఐ ఉస్మాన్ షరీఫ్, ఎస్ ఐ నరేష్,ఎస్ఐ తేజేశ్వర్ రెడ్డి, ఈ శిబిరంలో యువకులతో పాటు సమీప గ్రామాల్లో యువత పలువురు పోలీస్ అధికారులతో పాటు స్థానికులు స్వచ్ఛందంగా వచ్చి పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు గుండ్ల గోవర్ధన్, పొన్నం యాదగిరి, సల్ల రమేష్,జూనియర్ బోయిన నవీన్, జొన్న బోయిన పాపయ్య పాల్గొన్నారు.

## పత్తి కింటకు10.000 మద్దతు ధర ఇవ్వాలి.

- మొక్కజొన్న, మిరప, పసుపు, తేజ మిర్చి, చెరుకు, పంటలకు మద్దతు ధర కల్పించాలి.
- పత్తి తేమ శాతం 15 నుండి18 వరకు cci కేంద్రాలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలి.
- కామేపల్లి, కారేపల్లి CPI (ML )ND సబ్ డివిజన్ కార్యదర్శి భూక్య శివ నాయక్ డిమాండ్.



**కారేపల్లి, అక్టోబర్ 23, ప్రజా జ్యోతి:** సింగరేణి మండల కేంద్రంలో శుక్రవారం కారేపల్లి, కామేపల్లి మండలాల సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ సబ్ డివిజన్ కార్యదర్శి భూక్య శివ నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను తక్షణమే అమలు చేయాలి, ఆరు కాలంగా కష్టపడి పండించిన కనీస మద్దతు ధర లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పరిస్థితి నేడు దేశ వ్యాప్తంగా ఉంది, అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్న పరిమాణాలు చూస్తున్నాం. ప్రభుత్వాలు రైతే రాజు రైతే దేశానికి ఎన్న ముక అని అంటున్నాయి, కానీ ఆచరణలో రైతుల అభివృద్ధికి వ్యవసాయ అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## విద్య అభ్యసించిన పాఠశాలకు సహాయం

**కల్లూరు అక్టోబర్ 24 ప్రజా జ్యోతి:** కల్లూరు స్థానిక కిష్టయ్య బంజర్ ఎం పీ పీ ఎస్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు 20 టై లు మరియు బెల్టులు గుగులోతు భద్రు, బద్రిల కుమారుడు గుగులోతు నాగబాబు (సాఫ్ట్ వెర్) ప్రస్తుతం మంచి ఉద్యోగంలో స్థిరపడి తను ప్రాథమిక విద్య చదువుకున్న పాఠశాలకు సహాయం చేయాలనే ఉద్దేశ్యంతో గురువులను సంప్రదించి హెడ్ మాస్టర్ పర్వతపు దివ్యా, టీచర్ ఎం. దుర్గా, స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు వరకా రామారావు ద్వారా విద్యార్థులకు అందించటం జరిగింది. టై మరియు బెల్ట్ లు అందించిన ధాతలకు స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ శ్రీవ్యాల్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్ఫూర్తి ఫౌండేషన్ వాలంటీర్లు ఉబ్బన బాబురావు, జల్ది రామకృష్ణ పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వాముల మహా పడిపూజకు కాంగ్రెస్ నేత నారపోగు వెంకట్ 50వేల రూపాయల విరాళం..

- వెంకట్ కు కృతజ్ఞతలు తెలిపిన అయ్యప్ప భక్త బృందం..



**తల్లాడ, అక్టోబర్ 24 (ప్రజా జ్యోతి న్యూస్):** స్వగ్రామానికి సేవా కార్యక్రమాలు చేయాలనే ఆలోచనతో కాంగ్రెస్ పార్టీ నేత, సర్పంచుల ఫోరం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు నారపోగు వెంకట్ తన దాతృత్వాన్ని మరోసారి చాటుకున్నారు. తల్లాడ మండలంలోని క్రిష్ణాపురం గ్రామంలో అయ్యప్ప స్వామి మాల ధరించిన భక్తులకు ఆయన తనవంతుగా 50వేల రూపాయలను శుక్రవారం నిర్వాహకులకు విరాళంగా అందించారు. ఈనెల 25వ తేదీన గ్రామంలోని హరిహరసుత అయ్యప్ప భక్త బృందం ఆధ్వర్యంలో మహా పడిపూజ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన అయ్యప్ప స్వాములకు 50 వేల నగదును అందించి తన సేవా గుణాన్ని చాటుకున్నారు. గతంలో కూడా ఇంత పెద్ద నగదును అయ్యప్ప స్వాములకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన్మభూమికి సేవ చేయాలనే లక్ష్యంతో ప్రతి ఏడాది ఈ నగదును అందిస్తున్నట్లు తెలిపారు. తాను ఎక్కడ ఉండా గ్రామాభివృద్ధిలో తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని పేర్కొన్నారు. నగదును అందించిన వెంకట్ కు అయ్యప్ప స్వామి భక్త బృందం సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అభిరామ్ ఐఏఎస్ అకాడమీ చైర్మన్ విలా సాగరం అభిరామ్, స్వాములు విలాసాగరం వెంకట్రావు, విలా సాగరం శ్రీను పాల్గొన్నారు.

# పట్టణ కూలీలకు ఉపాధి హామీ పని కల్పించాలి...



**కల్లూరు అక్టోబర్ 24 ప్రజా జ్యోతి:** కల్లూరు పట్టణం కామ్రేడ్ దోమ తొట్టి పకీర్ మీటింగ్ హాల్లో రావి వెంకట సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సమావేశంలో సత్తుపల్లి వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు తన్నీరు కృష్ణార్జున రావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు తగ్గిపోయి కార్మికులు అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని, పనులు లేక వలసలు వెళ్లాల్సి వస్తుందని, కాబట్టి వెంటనే ఉపాధి హామీ పనులు కొనసాగించాలని అన్నారు .అదేవిధంగా పట్టణ ప్రాంతాల్లో ఉన్న పేదలకు కూడా ఉపాధి హామీ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం వందరోజుల పనిని 200 రోజులుగా చేయాలని ఉపాధి పనిలో కనీస కూలి 600 రూపాయలుగా ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో పనిచేసిన కూలీలకు ఇంత వరకు ఉపాధి డబ్బులు రాలేదని వాటిని వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా అధిక వర్షాల వల్ల అన్ని రకాల వ్యవసాయ పంటలు దెబ్బతిని రైతాంగం తీవ్ర నష్టాల్లో కురుకుపోయారని, రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీనికి తగిన విధంగా గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దళారులు పండిన కొద్ది పంటను కూడా ఇష్టారాజ్యంగా కొనుగోలు చేస్తున్నారని రైతులకు కనీసం గిట్టుబాటు ధర కూడా రాకుండా కొర్రీలు పెడుతున్నారని దీన్ని వెంటనే నివారించాలని ప్రతి ధాన్యపు గింజ ప్రభుత్వ కొనుగోలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఇచ్చిన 6 గ్యారంటీలు పూర్తిస్థాయిలో అమలు చేయాలని వ్యవసాయ కూలీలకు ఇస్తానన్న 12 వేల రూపాయలు ఎలాంటి ఆంక్షలు లేకుండా వెంటనే అందించాలని పెన్షన్లు 2000 రూపాయల నుంచి 4000 రూపాయలు చేస్తామని చెప్పి ఇంతవరకు అమలు చేయలేదని ,వికలాంగులకు 6000 ఇస్తామని చెప్పి వాటిని కూడా అమలు చేయలేదని, ప్రతి మహిళకు 2500 ఇస్తామని చెప్పి వాటిని కూడా ఇవ్వటం లేదని వీటన్నింటినీవెంటనే అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాల ఫలితంగా వ్యవసాయ రంగం కుందేలు అవుతుందని ,దీంతో వ్యవసాయ కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని ఆయన అన్నారు వ్యవసాయ కార్మికులకు గ్రామాల్లో ఉండే పేదలకు నిరంతరం ఉపాధి కల్పిస్తూ సమగ్ర చట్టాలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సభ్యులు బీరవల్లి బాబు ,బంక లక్ష్మయ్య, నాయుడు రజిని, నాయుడు కృష్ణ వాసు ,కంచ పోగు జమలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుని సస్పెన్షన్‌పై ఎర్రగడ్డ గ్రామ ప్రజల ఆగ్రహం

- ఎంఈఓ కార్యాలయం ముందు విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన
- తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్.



**తిరుమలాయపాలెం, అక్టోబర్ 24, ప్రజా జ్యోతి :** తిరుమలాయపాలెం మండల పరిధిలోని ఎర్రగడ్డ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు భూక్య కేశ్యాను సస్పెండ్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ గ్రామ ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయం ఎదుట శుక్రవారం భారీగా నిరసన తెలిపారు. తమ పిల్లల విద్యకు అంకితభావంతో సేవలందిస్తున్న, ఉపాధ్యాయుడిని అకారణంగా సస్పెండ్ చేయడం, అన్యాయమని. తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. భూక్య కేశ్యా సస్పెన్షన్ కారణంగా పాఠశాలలో బోధన పూర్తిగా దెబ్బతిందని, విద్యార్థుల చదువు మధ్యలో ఆగిపోయే పరిస్థితి ఏర్పడిందని వారు పేర్కొన్నారు. తక్షణమే ఉపాధ్యాయుడిని విధుల్లోకి తీసుకోకపోతే, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు మరింత తీవ్రస్థాయిలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు నినాదాలు చేస్తూ ఎంఈఓ కార్యాలయాన్ని ముట్టడించారు. గ్రామ విద్యాభివృద్ధి కోసం కృషి చేసిన ఉపాధ్యాయుడిని ఇలా సస్పెండ్ చేయడం ప్రజలకు నచ్చదని, ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తిరుమల పాలెం మాజీ ఎంఆర్పిఎస్ మండల అధ్యక్షులు టేకుమట్ల బాబు రావు, గద్దల సురేష్, మేడ రామయ్య, మేడ నాగన్న, గోవింద బిక్షం, పాలకుర్తి రమేష్, గోవింద ఉపేందర్, గోవింద నాగరాజు, గుంటేటి మంగయ్య, పసలాది రవి, తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు

- మెగా జాబ్ మేళా ను సద్వినియోగం చేసుకోండి ఏఎంసి చైర్మన్ భాగం..



**కల్లూరు అక్టోబర్ 24 ప్రజా జ్యోతి:** సత్తుపల్లి శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ సత్తుపల్లి సింగరేణి యాజమాన్య సహకారంతో అక్టోబర్ 26 ఆదివారం నాడు సత్తుపల్లి పట్టణం రాణి సెలబ్రేషన్స్ ఫంక్షన్ హాల్ లో ఉదయం 9 గంటలకు ప్రారంభం కానున్న మెగా జాబ్ మేళా కార్యక్రమంలో కల్లూరు మండలంలోని అన్ని గ్రామాల నిరుద్యోగ యువత పాల్గొనాలని కల్లూరు మండల ఏఎంసి చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి తెలియజేశారు. అందరూ ప్రభుత్వ ఉద్యోగం కోసం మాత్రమే ఎదురు చూడకుండా ప్రైవేట్ సంస్థల ద్వారా మంచి ఉద్యోగం సాధించుకోవాలని యువతకు సూచించారు. సత్తుపల్లి నియోజకవర్గంలో ఎంతోమంది యువత ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్నారని అందుకోసమే ఎమ్మెల్యే డాక్టర్ మట్టరాగమయి దయానంద్ సింగరేణి యాజమాన్యంతో చర్చించి ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. ఒక్క నిరుద్యోగికి అయినా ఉద్యోగం వస్తే వారి కుటుంబం సంతోష పడుతుందని తెలియజేశారు. జరగబోతున్న ఈ మెగా జాబ్ మేళా అవకాశాన్ని కల్లూరు పట్టణ మరియు గ్రామీణ యువత అధిక సంఖ్యలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

## ముంచుకొస్తున్న తుఫాన్

- భారీ వర్ష సూచన రైతులు దిగాలు



**వేంసూర్ అక్టోబర్ 24 ప్రజా జ్యోతి** మండల పరిధిలో రాగల రెండు మూడు రోజులు భారీ వర్షాలు వచ్చే అవకాశం ఉంది ఇప్పటికే రెండు రోజులు నుంచి వర్షాలు బాగా కురుస్తున్నాయి మరో రెండు రోజులు ఈ విధంగా ఉండే అవకాశం ఉంది ఇలాగే ఈ వర్షాలు ఉంటే రైతులు యొక్క పంటలు పాడైపోయే ప్రమాదం ఉంది కాబట్టి రైతులు చాలా దిగాలుగా ఉన్నారు ఈ సంవత్సరం పంటలు చాలా అద్భుతంగా పండాయి అవి చేతికి రావడానికి మరి కొంత సమయం ఉంది దానికి ముందుగానే ఈ తుఫాను ప్రభావం వల్ల వంటలు పాడే ప్రమాదం ఉందని రైతులు చాలా ఆందోళన ఉన్నారు మొత్తానికి మరో రెండు మూడు రోజుల్లో వర్షం ఉండే అవకాశం ఉంది అని వాతావరణం నిపుణులు తెలియజేస్తున్నారు

## వరి పంట పొలాలను పరిశీలించిన మండల వ్యవసాయ శాఖ అధికారి రామడుగు వాణి



**పాలేరు ఆర్సీ అక్టోబర్ 24 ప్రజా జ్యోతి** కూసుమంచి మండలంలోని గైగోల్లపల్లి గ్రామంలో వరి పొలాలను మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వరి పొలాలు గింజ పాలు పోసుకునే దశ నుండి కోత దశలో ఉన్నాయని తెలిపారు.ఈ సమయంలో అక్కడక్కడా కంకి నల్లి ఆశించినట్లు గమనించడం జరిగిందని , దీని నివారణకు స్పైరోమెసిఫెన్ లీటరు నీటికీ ఒక గ్రాము చొప్పున కలిపి పిచికారి చేయాలని సూచించారు. అదేవిధంగా ప్రస్తుత వాతావరణంలో కాటుక తెగులు ఆశించే అవకాశం ఉందని దీని నివారణకు ప్రొపికొనజోల్ 1 మి.లీ. లీటరు నీటికి లేదా కార్బెండజిమ్ 50% మందును 1 గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. అదేవిధంగా ఈ సంవత్సరం మండలంలో 14 ధాన్యం కొనుగోలు కేంద్రాలు మొదలవ్వనున్నాయని, రైతులందరూ వాటిని వినియోగించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి సాయిరాం రైతులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించిన కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ






**ఖమ్మం ప్రతినిధి, ప్రజాజ్యోతి** స్థానిక 46 డివిజన్ పరిధిలోని ప్రధాన పారిశుద్ధ్య సమస్యలను మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు,మేయర్ పునుకొల్లు నీరజ,యువ నాయకులు తుమ్మల యుగంధర్ కి తెలియజేయగా మున్సిపల్ అధికారులను సమస్యలు పరిష్కరించాలని ఆదేశించగా అట్టి పనులను కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ శుక్రవారం పర్యవేక్షించారు.ప్రధానంగా మంత్రి తుమ్మల సహకారంతో ఇటీవల నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఎప్పుడు మురికి నీళ్లు నిలువ ఉండి ప్రజలకు ఇబ్బంది కలుగుతున్నందున ఈరోజు ప్రత్యేక వాహనం ద్వారా మురుగును తొలగించి సమస్య పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించడం జరిగింది. అదేవిధంగా ఫిషరీస్ ఆఫీస్ వెనుక భాగం నుండి ఎఫ్ సి ఐ బైపాస్ రోడ్ వరకు గల కాలువలో గల మురికి వ్యర్థాలను జేసీబీ తో తొలగించడం జరిగింది. రేపు కూడా సమస్య పరిష్కారం అయ్యేవరకు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు షేక్ రజ్జి,మున్సిపల్ శానిటరీ సూపర్వైజర్ సాంబయ్య, జవాన్ శ్రీనివాస్, నాయకులు ఎమ్మె రామకృష్ణ, నర్సిరెడ్డి, మురళి,ఓరుగంటి రాజనరేష్,మున్సిపల్ సిబ్బంది స్థానికులు పాల్గొన్నారు.

# తల్లాడలో పెట్రేగిపోతున్న అక్రమ పత్తి వ్యాపారాలు..

- **రైతుల నుండి దండు కొంటున్న ప్రైవేటు వ్యాపారులు..**
- **చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న మార్కెట్ అధికారులు..**
- **జిల్లా కలెక్టర్ దృష్టి సారించాలని రైతులు వేడుకలు..**





**తల్లాడ, అక్టోబర్ 24 (ప్రజా జ్యోతి న్యూస్):** ఖమ్మం జిల్లా తల్లాడ పట్టణంలో ప్రైవేటు పత్తి వ్యాపారుల దందా మూడు పువ్వులు ఆరుకాయలుగా విరాజుల్లుతుంది. ప్రభుత్వం అధికారికంగా సీసీఐ కేంద్రాలను ప్రారంభించక మునుపే ప్రైవేటు వ్యాపారులు మాత్రం తమ అక్రమ వ్యాపారాన్ని నెల రోజుల నుండి ప్రారంభించారు. ప్రతి ఏడాది దసరా పండుగ వచ్చిందంటే అక్రమ ప్రతి వ్యాపారులకు అడ్డు అదుపు లేకుండా పత్తిని తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ జేబులు నింపుకుంటున్నారు.జిల్లాలో ఎక్కడా లేనివిధంగా తల్లాడలో అక్రమ పత్తి వ్యాపారం మాత్రం భారీ ఎత్తున కొనసాగుతుంది. తల్లాడ మండలంలోని అన్నారుగూడెం,నరసరావుపేట, బాలపేట, ఏనుకూరు మండలంలోని నూకలంపాడు గ్రామాలకు చెందిన వారు ఆటోల ద్వారా తెలంగాణతో పాటు ఆంధ్ర ప్రదేశ్, చతిస్గడ్ తదితర రాష్ట్రాల నుండి పత్తిని తీసుకొస్తుంటారు. ఈ నేపథ్యంలో వారు ఆ ప్రాంతాల్లో రైతులు మోసం చేస్తూ తీసుకొచ్చి ఇక్కడ అక్రమ వ్యాపారులకు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. ప్రైవేట్ వ్యాపారులు కూడా ఇదే అదునుగా భావించి తక్కువ ధరకు పత్తిని కొనుగోలు చేస్తూ అధిక లాభాలు గడిస్తున్నారు. ఇంత జరుగుతున్నా కానీ మార్కెటింగ్ శాఖ అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రైవేటు వ్యాపారుల నుండి అధికారులు మామూళ్ల కు అలవాటు పడి పట్టించుకోవటం లేదని ఆరోపణలు రైతుల నుండి వినిపిస్తున్నాయి. ప్రభుత్వం అధికారికంగా సీసీఐ కేంద్రాన్ని ఏర్పాటు చేసినప్పటికీ అక్కడకు ఎవరు కనిపించకపోవడం గమనార్హం. జిల్లా అధికారులు తల్లాడలో భారీగా నడుస్తున్న అక్రమ పత్తి వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. బుధవారం తల్లాడలో సీసీఐ కేంద్రాన్ని ప్రారంభించేందుకు హాజరైన రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయిని వివరణ కోరగా ప్రైవేట్ పతి వ్యాపారులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎలాంటి అనుమతి లేకుండా పత్తి వ్యాపారం చేపడితే నోటీసులు జారీ చేసి సీట్ చేయటం జరుగుతుందని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు పత్తిని కొనుగోలు చేయాలని, రైతుల నుండి తక్కువ ధరకు కొనుగోలు చేసి ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆమె హెచ్చరించారు. అదేవిధంగా ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించి తల్లాడ లో నడుస్తున్న ప్రైవేటు పత్తి వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

# రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి

- **అడిషనల్ డీసీపీ లా అండ్ అర్డర్**





**ఖమ్మం, అక్టోబర్ 24 (ప్రజా జ్యోతి న్యూస్):** రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని అడిషనల్ డీసీపీ లా &అర్డర్ ప్రసాద్ రావు అన్నారు.పోలీస్ అమరవీరుల వారోత్సవాల ఫ్లాగ్ డే పురస్కరించుకొని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు సీటి ఆర్మూడ్ పోలీస్ హెడ్ క్వార్టర్స్ లోని రక్తదాన శిభిరాన్ని నిర్వహించారు. అడిషనల్ డీసీపీ లా &అర్డర్ ప్రసాద్ రావు అడిషనల్ డీసీపీ అడ్మిన్ రామానుజం,అడిషనల్ డీసీపీ ఏఆర్ కుమారస్వామి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ లా &అర్డర్ మాట్లాడుతూ ప్రజల కోసం ప్రాణాలిచ్చి..విధినిర్వహణలో ఆదర్శంగా నిలిచిన పోలీసు అమరవీరులను స్మరించుకుంటూ అక్టోబర్ 21 నుండి అక్టోబర్ 31 వరకు పోలీస్ ఫ్లాగ్ డే నిర్వహిస్తున్నామని అన్నారు. అందులో భాగంగా అన్నిటికంటే గొప్పదానమైన రక్తదానం ద్వారా ప్రాణాలు కాపాడాలని ఉద్దేశంతో తలసేమియా చిన్నారి బాధితులకు సంకల్ప స్వచ్ఛంద సంస్థ ద్వారా రక్తాన్ని అందించాలని శిభిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రధనంగా సకాలంలో రక్తం అందించలేక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని గుర్తు చేశారు.భారీ ఎత్తున యువత, పోలీసు బలగాలు, ఆటో డ్రైవర్లు, సామాన్య ప్రజలందరిని తరలివచ్చి 150 మంది రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. రక్తదానం చేసిన యువతకు ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు. 32 సార్లు రక్తదానం చేసిన ఎస్సై వేముల సుధాకర్ రెడ్డి ని అధికారులు అభినందించారు.కార్యక్రమంలో ఏసీపీలు రమణమూర్తి, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు, సిఐలు బాలకృష్ణ,భానుప్రకాశ్, మోహన్ బాబు,సత్యనారాయణ, ఉస్మాన్ షరీఫ్,రాజిరెడ్డి,ఆర్ ఐలు కామరాజు,శ్రీశైలం,సురేష్,సాంబశివ రావు,డాక్టర్ వేణుమాధవ్ సంకల్పం తాలసేమియా స్వచ్ఛంద సంస్థ,ఆటో యునియన్ తదితరులు పాల్గొన్నారు.





# ఈపీఎఫ్ఓ నిధి ఆప్కే నికట్ 2.0 కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- ప్రాంతీయ పీ.ఎఫ్. కమీషనర్ శ్రీనివాస్

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** స్థానిక ఖమ్మం జిల్లాలోని సంస్థల యజమానులు,ఉద్యోగులు,పెన్షనర్ల కొరకు ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్, జిల్లా కార్యాలయం, ఖమ్మం అక్టోబర్ 27న సోమవారం ఉదయం 9.30 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు నిధి ఆప్కే నికట్ 2.0 కార్యక్రమాన్ని ఖమ్మం స్టేషన్ రోడ్ లోని ఆక్స్ ఫోర్డ్ స్కూల్ నందు నిర్వహించనున్నట్టు ప్రాంతీయ పీ.ఎఫ్. కమీషనర్ వై.డి. శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా ఉద్యోగులు, యజమానులు,పెన్షనర్లకు వివిధ సేవలు, అవగాహన కార్యక్రమాలు అందించబడతాయని అన్నారు.ఉద్యోగుల కోసం ఆన్‌లైన్ సేవలపై అవగాహన కల్పించడం,కొత్తగా కవరైన సంస్థల యజమానులకు పరిచయం,ఆన్ లైన్ సేవల వివరాలు, పెన్షనర్ లకు జీవన్ ప్రమాణ, ఇతర సమస్యల పరిష్కారం,ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజ్ గార్ యోజనపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రాంతీయ పీ.ఎఫ్.కమీషనర్ శ్రీనివాస్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం పునర్నిర్మానం పనులు ప్రారంభం

- దేవాలయ పాలకవర్గం ప్రమాణ స్వీకారం



**ముదిగొండ అక్టోబర్ 24( ప్రజా జ్యోతి )** యడవల్లి శ్రీ లక్ష్మీ యోగానంద లక్ష్మీ నరసింహస్వామి దేవాలయ పాలకవర్గ ప్రమాణ స్వీకారం అనంతరం ఆలయ పునర్నిర్మాణం చేయుట కొరకు మన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు భట్టి విక్రమార్క మల్లు శ్రీ యోగ నంద లక్ష్మీనరసింహస్వామి ఎడవల్లి దేవాలయానికి నాలుగు కోట్ల 75 లక్షల రూపాయలు కేటాయింపు చేసిన సందర్భంగా ఈరోజు ఆలయం పునర్నిర్మాణం చేయుట కొరకు అంకురార్పణ చేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఈసీ, బి బ్లాక్ అధ్యక్షుడు కందిమల్ల వీరబాబు, మొదటి జోన్ ఇంచార్జ్ భూక్య ధర్మానాయక్,మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు చెరుకుపల్లి రాంబాబు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంతగాని కాశయ్య ,గ్రామ సర్పంచ్ చెరుకుపల్లి వెంకటేశ్వర్లు,ముదిగొండ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు దొంతగాని నాగరాజు,ఆలయ కమిటీ పాలకవర్గం సభ్యులు,ఆలయ పూజారి,తదితరులు పాల్గొన్నారు.

# తల్లాడ పంచాయతీ మాజీ వార్డు సభ్యులు రెడ్డెం అచ్చమ్మ మృతి..



**తల్లాడ, అక్టోబర్ 24 (ప్రజా జ్యోతి న్యూస్):** తల్లాడ మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన తల్లాడ గ్రామపంచాయతీ మాజీ వార్డు మెంబర్ రెడ్డెం అచ్చమ్మ (71)శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆమె గతంలో తల్లాడ మేజర్ గ్రామపంచాయతీ వార్డు సభ్యురాలుగా పనిచేశారు.2004 సంవత్సరంలో ఆమె వార్డు మెంబర్ గా విధులు నిర్వహించి, ఆ ప్రాంత అభివృద్ధితో పాటు పలు సమస్యలను పరిష్కరించారు. ఈ విషయం తెలుసుకున్న బీర్ఆర్ఎస్ తల్లాడ మండల అధ్యక్షులు రెడ్డెం వీరమోహన్ రెడ్డి ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాప సానుభూతిని వ్యక్తం చేశారు. అదేవిధంగా ఆమె కుమారులు రెడ్డెం రామకృష్ణారెడ్డి, రెడ్డెం నారాయణరెడ్డిలను ఆయన పరామర్శించారు. నివాళులు అర్పించిన వారిలో స్థానికులు ఉన్నారు.

# సీపీఐలో చేరిన సిపిఎం యువజన సంఘం డి.వై.ఎఫ్.ఐ జిల్లా అధ్యక్షుడు చింతల.రమేష్

- - పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాధరంగ ఆహ్వానించిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, యం.ఎల్.ఏ కూనంనేని.సాంబశివరావు.
- - యువ కమ్యూనిస్టులతో పార్టీకి పూర్వ వైభవం. -కూనంనేని వెల్లడి.



**రఘునాథపాలెం ప్రజా జ్యోతి :** యువ కమ్యూనిస్టులతోనే కమ్యూనిస్టు పార్టీ సీపీఐకి పూర్వ వైభవం వస్తుందని,కామ్రేడ్ చింతల. రమేష్ పార్టీలో చేరడంతో చాలా సంతోషంగా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, యం.ఎల్.ఏ కూనంనేని.సాంబశివరావు వెల్లడించారు. స్థానిక గిరి ప్రసాద్ భవన్ లో సీపీఐ జిల్లా కార్యాలయంలో సిపిఎం యువజన విభాగం డి.వై.ఎఫ్.ఐ జిల్లా అద్యక్షుడు చింతల.రమేష్,చిమ్మపూడి గ్రామ సిపిఎం శాఖ కార్యదర్శి రెమల్లె.జైపాల్, శాఖ సభ్యులు జ్యోతి బస్,చంద్రమ్మ,మల్లెంపాటి. రమేష్ లతో పాటు మరికొంతమంది కార్యకర్తలు సిపిఎం పార్టీకి మూకుమ్మడిగా రాజీనామాలు చేసి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని.సాంబశివరావు, జాతీయ సమితి సభ్యులు భాగం.హేమంత్ రావు,జిల్లా కార్యదర్శి దండి.సురేష్ ఇతర జిల్లా నాయకత్వం సమక్షంలో సీపీఐ పార్టీలో చేరడం జరిగింది.చింతల.రమేష్ కి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి,యం.ఎల్.ఏ కూనంనేని. సాంబశివరావు పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాధరంగ ఆహ్వానించడం జరిగింది.ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ యువ కమ్యూనిస్టులతోనే కమ్యూనిస్ట్ పార్టీలు బలోపేతం అవుతాయని,చిమ్మపూడి గ్రామం నుండి గత 15 సంవత్సరాలుగా వామపక్ష ఉద్యమాలలో పనిచేసిన చింతల.రమేష్ పార్టీలో చేరడం సంతోషంగా ఉందని ఆయన అన్నారు.డిసెంబర్ 26న కమ్యూనిస్ట్ పార్టీ వందేళ్ల వేడుక ఉద్యమాల గుమ్మం ఖమ్మం అయిందని అయిదు లక్షల మందితో భారీ బహిరంగ సభ ఉంటుందని ఖమ్మం జిల్లాలో ఉన్న పార్టీ శ్రేణులు అహర్నిశల కృషి చేసి జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సభలో సీపీఐ జాతీయ కమిటీ సభ్యులు భాగం.హేమంత్ రావు,రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మెన్ మౌలానా,జిల్లా కార్యదర్శి దండి.సురేష్ మాట్లాడుతూ జిల్లాలో డిసెంబర్ 26న జరిగే భారీ బహిరంగ సభ ద్వారా సీపీఐ పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలని,పార్టీ కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని పార్టీని బలోపేతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు జానీమియా, గోవిందరావు, సలాం, సింగు నరసింహరావు, మేకల శ్రీనివాసరావు,పోటు కళావతి,సీతామహాలక్షి , తాటి వెనకటేశ్వరావు పగడాల మల్లేష్, యానాల సాంబశివారెడ్డి, రఘునాథపాలెం మండల కార్యదర్శి శాకమూరి శ్రీనివాస్ విద్యార్థి, యువజన నాయకులు నానాబాల రామకృష్ణ , ఇటికల రామకృష్ణ, మడిపల్లి లక్ష్మణ్ సమితి సభ్యులు తాటి నిర్మల, శ్రావన్, సైదా, నాగుల్ మీరా, జూల.వెంకటేశ్వర్లు, ప్రొద్దుటూరు.వెంకటరెడ్డి, గాడిచర్ల.సత్యనారాయణ రఘుంధపాలెం మండల, చిమ్మపూడి గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన తుమ్మలపల్లి రమేష్ దంపతులు..



**తల్లాడ, అక్టోబర్ 24 (ప్రజా జ్యోతి న్యూస్):** తల్లాడ మండలంలోని నరసింహారావుపేట గ్రామానికి చెందిన సుంకర వెంకటేశ్వర్లు, లలిత దంపతుల కుమార్తె లక్షి శ్రావణి వివాహం శుక్రవారం ఖమ్మంలో జరిగింది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ తల్లాడ మండల నాయకులు తుమ్మలపల్లి రమేష్, మాజీ ఎంపీటీసీ తుమ్మలపల్లి సత్యవతి దంపతులు హాజరై నూతన వధూవరులకు అక్షింతలు వేసి దీవించారు. నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అన్నారుగూడెం ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ యాకూబ్ పాషా, పడాల లక్ష్మణ్, సూదా నరసింహారావు, గోపిశెట్టి వరప్రసాద్, తదితరులు ఉన్నారు.

# మెగా జాబ్ మేళా

- అవకాశాన్ని ఉపయోగించుకోవాలని మండల నిరుద్యోగులను కోరిన ఎమ్మెల్యే మట్టా



**వేంసూరు :అక్టోబర్ 24 (ప్రజా జ్యోతి)** రేపు జరుగుతున్న మెగా జాబ్ మేళాకు మండలంలోని నిరుద్యోగులు అందరూ హాజరు కావాలని సత్తుపల్లి శాసనసభ్యురాలు మట్టా రాగమయి కోరారు. హైదరాబాద్ వెళ్లకుండానే 50 కంపెనీలు మన సతుపల్లి రాణి కళ్యాణ మండపంలో రేపు ఇంటర్వ్యూ చేయనున్నాయి. వాటిలో మూడు వేల జాబులు ఉన్నాయని వారు కోరారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగులు అందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు

# ప్రభుత్వ హాస్పిటల్ లో సుఖ ప్రసవాలు పెంచాలి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రామారావు




**మధిర, ప్రజాజ్యోతి:** తెలంగాణ ఆరోగ్య శాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల ఆదేశాలు మేరకు శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, తెలంగాణ వైద్య విధానపరిషత్ సంయుక్తంగా స్థానిక మధిర రిక్రాయేషన్ క్లబ్ లో మధిర ప్రభుత్వ హాస్పటల్ పీహెచ్ సీ బనిగండ్లపాడు, పీహెచ్ సీ మాటూరుపేట, పీహెచ్ సీ దెందుకూరు వైద్య అధికారులు, పారా మెడికల్ సిబ్బంది, నర్సింగ్ ఆఫీసర్స్ సిబ్బంది కలిపి ప్రత్యేక ప్రభుత్వ హాస్పిటల్ లో సుఖ ప్రసవాలు పెంచాలి అనే విషయం మీద సమన్వయ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం మధిర సివిల్ హాస్పటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కనకపుడి అనిల్ కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేయగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ తరుపున జిల్లా మాతాశిశు సంరక్షణ ప్రోగ్రాం, జిల్లా అసంక్రమిక (ఎన్సిడి )వ్యాదుల నివారణ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రామారావు ముఖ్య అతిధిగా పాల్గొని హాస్పిటల్ కానుపు మీద ప్రత్యేక దృష్టి పెట్టి డాక్టర్ లు డెలివరీలు పెంచాలని, దీనికి క్రింది స్థాయి పారామెడికల్ సిబ్బంది సూపర్ వైజర్ క్యాడర్ లు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు హెచ్ఈఓ లు నర్సింగ్ ఆఫీసర్లు అందరూ ప్రతి గర్భిణీ స్త్రీ కీ సంపూర్ణముగా ఆరోగ్య సేవలు అందించాలి అని సూచించారు. అదే విధంగా మధిర ప్రభుత్వహాస్పిటల్ లో త్వరలో దియేటర్ ల్లో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసి సిజెరియేన్ ఆపరేషన్ లు నిర్వహించడం జరుగుతుంది అని మధిర హాస్పిటల్ సివిల్ సర్జన్, గైనకాలజిస్టు ప్రసన్న జ్యోతి తెలిపారు. అదే విధంగా స్కానింగ్ సౌకర్యం ఏర్పాటు మరియు గర్భిణీ స్త్రీ లు 5వ నెల నుండి 7వ నెల ప్రత్యేక చెకప్ లు తప్పకుండా అన్ని పీహెచ్ సీ లు నుండి మధిర ప్రభుత్వ హాస్పిటల్ కు పంపాలని సూచించారు. షుగర్ బిపి టెస్ట్ ల గురించి సంపూర్ణ వ్యాది నిరోధక టీకాలు కార్యక్రమం మొదలగు ప్రోగ్రాం లు టార్గెట్ పూర్తి చెయ్యాలి అని వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనిల్ కుమార్, పీహెచ్ సీ డాక్టర్ లు వీరబాబు, పృథ్వి రాజ్, ప్రశాంత్ రామ్మోహన్ నాయక్, మోదుగు వెంటేశ్వర్లు, శ్రీనివాస్ రావు, షహనాజ్ తదితరడాక్టర్ బృందం వివధా పారామెడికల్ సిబ్బంది ఆశ నోడల్ పర్సన్ లు పల్లె దావఖాన్ సిబ్బంది బీడీకే సిబ్బంది ఎఎన్ఎమ్ లు ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సెంటి లైటింగ్ సింపుల్ పుస్తకం రచించిన భీష్మారెడ్డి..



**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి:** మండల పరిధిలో బనిగండ్లపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ రచయిత కవి శీలం భీష్మారెడ్డి తాను రచించిన ఆంగ్ల కవితల సంకలనం సెంటి లైటింగ్ సింపుల్ అనే పుస్తకాన్ని విద్యార్థుల సమక్షంలో విడుదల చేస్తూ ఆ పుస్తక పరిచయ ప్రిన్సిపాల్ రవికుమార్ ఇతర అధ్యాపకలు సమక్షంలో నిర్వహించారు ఈ కార్యక్రమంలో భీష్మారెడ్డి తాను కవిగా రచయితగా గత మూడు దశాబ్దాలుగా ఎంత కృషి రాశారు 100 పుస్తకాలు రాయడానికి కొన్నివేల ఆంగ్ల కవితలు తెలుగు కవితలు పాటలు రాయడానికి తాను ఎంతగా శ్రమించినది తన రచనలు అన్నిటిని ఒక్కొక్కటి పుస్తక రూపంలో తీసుకువచ్చే కార్యక్రమాలలో సెంటిలేటింగ్ సింపుల్ అనే ఆంగ్ల సంకలనాన్ని ఆ పుస్తకంలో తాను పాటికలోకానికి ఇచ్చే సందేశం గురించి వివరించారు ఇప్పటికే ఖమ్మం జిల్లా కవుల చరిత్ర అనే పుస్తకాన్ని సాహితీ స్రవంతి అనే సంస్థ చెప్పారు 2014లో ప్రచురించగా అందులో తనను ఖమ్మం జిల్లా కవి గా గుర్తించి తన చరిత్రను తన ఫోటో తో సహా బీఫ్ గా ప్రచురించటం జరిగిందని తెలియజేశారు విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆత్మవిశ్వాసాన్ని కోల్పోవద్దని చెప్పారు.

## కార్తీక మాసం సందర్భంగా పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు

- మధుర డిపో మేనేజర్ శంకర్ రావు



**మధిర ప్రజా జ్యోతి** కార్తీక మాసం సందర్భంగా భక్తుల కోరిక మేరకు పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్ సర్వీసులను నడుపుతున్నట్లు మధిర డిపో మేనేజర్ డి.శంకర్ రావు తెలిపారు. అన్నవరం, పంచారామాలు, అరుణాచలం కు సంబంధించిన పోస్టర్ను డిపో మేనేజర్ డి శంకర్ రావు చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ పవిత్ర కార్తీకమాసం సందర్భంగా శైవ క్షేత్రాలకు మధిర డిపో నుండి పంచరామాలకు, అన్నవరం అదేవిధంగా అరుణాచలానికి(కార్తీక పౌర్ణమి కి ) ప్రత్యేక డీలక్స్ బస్సు సర్వీసును ఏర్పాటు చేసినట్లు అయినా తెలిపారు .ఈ కార్తీకమాసంలో ప్రతి ఆదివారం రాత్రి 9 గంటలకు మధిర నుండి పంచారామాలు అదే విధంగా అన్నవరానికి డీలక్స్ బస్సు సర్వీసు ఏర్పాటు చేసిన్నట్లు ఆయన తెలిపారు. ఈ సదవకాశాన్ని మధిర మరియు పరిసర ప్రాంతాల ప్రయాణికులు భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు ఈ నంబర్లను సంప్రదించవలసిందిగా ఆయన కోరారు 6301151730 9063412754

# పాలేరు సంతలో...
# మౌలిక వసతులు ఎక్కడ..?

- దెబ్బతింటున్న వీధి వ్యాపారులు.
- వసూళ్లు వరకే. అవస్థాపన సౌకర్యాలు కరువాయే.
- తమ గోడును వెళ్ళబుచుతున్న కూరగాయల వ్యాపారులు.



**పాలేరు ఆర్సీ అక్టోబర్ 24 ప్రజా జ్యోతి:** "అంగట్లో అన్ని ఉన్న అల్లుడు నోట్లో శని అన్నట్టు" ఈ సామెత పాలేరు సంతకు చక్కగా సరిపోతుంది.. కూసుమంచి మండలం పాలేరు గ్రామంలో ప్రతి శుక్రవారం వారపు సంత జరుగుతుంది.. ఈ వారపు సంత ద్వారా గ్రామ పంచాయతీకి లక్షల రూపాయల ఆదాయం సమకూరుతుంది. ప్రతి ఏటా జరిగే వారపు సంత వేలం పాటలో సంతకు లక్షల రూపాయల ఆదాయం వస్తుందనీ మీకు తెలుసా..? ఈ వేలం పాట ద్వారా లక్షల రూపాయలు గ్రామ పంచాయతీకి ఆదాయంగా మారుతుంది.. ఇంతవరకు బాగానే ఉన్నా , సంత ఆదాయానికి , అభివృద్ధికి కీలక పాత్ర వీధి వ్యాపారులదే వారికి కనీస సౌకర్యాలు లేకపోవడం కోస మెరుపు (కూరగాయలు అమ్ముకోవడానికి వచ్చే వారి వలనే ఆదాయం). ప్రతి వారం వారపు సంత రోజున దాదాపు 300 కూరగాయల దుకాణాలు వెలుస్తాయి . ఆ రోజు వారపు సంత నుండి సంత నిర్వాహకులు వేల రూపాయలు వసూళ్లు చేస్తారు (ఒక్కో దుకాణం నుండి 50 రూపాయలు) అంటే అతిశయోక్తి కాదు. ఇంత ఆదాయం వస్తున్న సంతలో కూరగాయలు అమ్ముకోవడానికి వస్తున్న వీధి వ్యాపారులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారులు విఫలం అవుతున్నారు. కాదు అధికారుల నిర్లక్ష్యం కారణంగా వీధి వ్యాపారులు నష్టపోతున్నారు..

### వీధి వ్యాపారుల కష్టాలు పట్టించుకునే వారు లేరా..?

వీధి వ్యాపారుల కష్టాలు పట్టించుకునే నాథుడే కరువయ్యారు. దీంతో వీధి వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రతి రోజులాగే ఈ శుక్రవారం జరిగిన వారపు సంత రోజు ఎడతెరపని వర్షంతో వ్యాపారం లేక పాలేరు సంత వేలవేల పోయింది. వేల రూపాయల విలువైన కూరగాయలు అమ్ముకోవడానికి సరైన అవస్థాపన సౌకర్యాలు లేకపోవడంతో తీవ్రంగా నష్టపోయారు.. సంతలో కనీస అవస్థాపన సౌకర్యాలు కల్పించడం ద్వారా (కూరగాయలను నిల్వచేయడానికి) వీధి వ్యాపారుల వ్యాపారం సజావుగా సాగుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి శుక్రవారం జరిగే వారపు సంతలో ఎండకు ఎండుతూ. వానకు తడుస్తూ. కూరగాయలు అమ్ముకుంటున్నాం , వ్యాపారం చేసుకోవడానికి నిలువ నీడ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ వల్లే ఇంత ఆదాయం వస్తున్నా. తమకు మాత్రం చిన్న చిన్న సదుపాయాలు కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలం అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. వేలకు వేల రూపాయలు పెట్టుబడిగా పెట్టీ కూరగాయలు పండిస్తున్నాం ( కొందరు మారు బేరం చేస్తున్నారు). కానీ వర్షా కాలం , వాన కాలంలో కూరగాయలకు నీడ లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నాం.. తమ కష్టాన్ని గుర్తించి ప్రభుత్వం సంత అభివృద్ధికి ఆలోచన చేయాలని కోరుతున్నారు.

### పశువుల సంతలో మరింత దోపిడీ.

ఇక పాలేరు సంతలో పశువులు సంత గురించి ఎంత చెప్పుకున్న తక్కువే.మ పశువులను కొనడానికి వచ్చిన అమ్మడానికి వచ్చిన రహదారి ఖర్చుకు ఏం కొదవ ఉండదు. ఎంటర్ నుండి ఎగ్జిట్ వరకు పైసలతోనే పని. ఒక రకంగా చెప్పాలంటే పాలేరు సంతకు ప్రధాన ఆదాయ వనరు పశువుల సంత.. ఇంత ఆదాయం వస్తున్న ఈ పశువుల సంతలో నిలబడడానికి నిలువ నీడ ఉండదు.. సంత రోజున ఉదయం నుండి సాయంత్రం వరకు ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ ఉండాల్సిందే. వర్షా కాలంలో వర్షం వస్తె తడవాల్సిందే. ఎండాకాలంలో అయితే ఇక అంతే సంగతి . సంతకు వచ్చే వారి గొంతు తడుపుకోవటానికి కూడా మంచి నీటి చుక్క దొరకదు. ఇక మూగ జీవాల పరిస్థితి చెప్పేది ఏమి లేదు. దుమ్ము ధూళితో ఉదయం నుండి సాయంత్రం వరకు ఎన్నో ఇబ్బందులు పడుతూనే ఉంటారు. మరి ఇంత ఆదాయం వస్తున్న సంతలో అవస్థాపన సౌకర్యాలు లేకపోవడం గమనార్హం. ఆదాయం కావాలి కాని అవస్థాపన సౌకర్యాలు మాకు పట్టదు అన్నట్టు వ్యవహరిస్తున్నారు అధికారులు. ఇకనైన పాలేరు వారపు సంత అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## శిల్ప డెంటల్ కేర్ ప్రారంభించిన డాక్టర్ తుమ్మల యుగంధర్





**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** స్థానిక ఖమ్మం బైపాస్ రోడ్డులో కొత్తగా స్థాపించబడిన శిల్ప డెంటల్ కేర్ క్లినిక్ ను డాక్టర్ తుమ్మల యుగంధర్ శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు,ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.డాక్టర్ యుగంధర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం ప్రాధాన్యమని, ప్రత్యేకంగా నోటి ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెరగాలి. ఇలాంటి ఆధునిక దంత వైద్య సదుపాయాలు ఖమ్మంలో అందుబాటులోకి రావడం ఆనందదాయకం అన్నారు.క్లినిక్ నిర్వాహకులు డాక్టర్ శిల్ప మరియు బృందం మాట్లాడుతూ అత్యాధునిక పరికరాలతో,నిపుణుల సేవలతో ప్రజలకు నాణ్యమైన దంత వైద్యాన్ని అందించడమే తమ లక్ష్యమని తెలిపారు.